క్లుప్తంగా

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 74,268 మంది స్వామివారిని దర్శించుకోగా.. 26,817 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.32 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.


హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకటరమణ


డాక్టర్ వెంకటరమణ అధ్యక్షుడు


మనోజ్‌కుమార్ కార్యదర్శి

తిరుపతి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధానోపాధ్యాయ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కే.వెంకటరమణ (జెడ్పీహెచ్ఎస్, ఆర్.మల్లవరం) ఎన్నికయ్యారు. తిరుపతిలోని టీపీపీఎం హైస్కూల్లో గురువారం జిల్లా కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఇందులో భాగంగా కార్యదర్శిగా మనోజ్‌కుమార్ (జెడ్పీహెచ్ఎస్-గర్ల్స్, నాయుడుపేట), కోశాధికారిగా ఎస్.రవీందర్‌రాజు (జెడ్పీహెచ్ఎస్, దుర్గసముద్రం) ఎన్నికయ్యారు. అలాగే గౌరవాధ్యక్షులుగా చెంగల్‌రాజు (డైట్ లెక్చరర్), రాష్ట్ర కౌన్సిలర్లుగా బీ.మునిరత్నం, జీ.కృష్ణయ్య, సుధాకర్, మహిళా ప్రతినిధులుగా జీవీ.విష్ణువర్ధని, పీ.సునీత గౌడ్ ఎన్నికయ్యారు.

వెంటాడిన మృత్యువు


ప్రమాద స్థలం నుంచి సెగ్మెంట్‌ను మరో ప్రదేశానికి తరలిస్తున్న అధికారులు


మృతదేహాలను మూటగడుతున్న వైద్య సిబ్బంది

- శ్రీనివాస సేతు పనుల చివరి అంకంలో అపశ్రుతి
- మరో మూడు సెగ్మెంట్లు ఏర్పాటుతో ఫ్లైఓవర్ పూర్తి
- 5వ తేదీకల్లా పనులు పూర్తిచేసే క్రమంలో ప్రమాదం
- అనాథలుగా మృతులు

తిరుపతి తుడా: తిరుపతి స్మార్ట్ సిటీలో భాగంగా ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ నిర్మాణ పనుల చివరి అంకంలో అపశ్రుతి చోటుచేసుకుంది. బుధవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు దుర్మరణం పాలయ్యారు. ఆఫ్కాన్ సంస్థ ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కోసం వివిధ రాష్ట్రాల నుంచి కూలీలను రప్పించింది. నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో అనుకోని ప్రమాదం చోటుచేసుకుంది. సెగ్మెంట్లను ఏర్పాటు చేసే క్రమంలో భారీ క్రేన్ ఐరన్ రోప్ తెగిపోవడంతో 70 టన్నుల బరువు గల సెగ్మెంట్ ఆరు అడుగుల ఎత్తు నుంచి పడిపోయింది. ఈ ఘటనలో వెస్ట్‌బెంగాల్‌కు చెందిన అవిజిత్ (21), బిహార్ రాష్ట్రానికి చెందిన బొడ్డు మండల్ (41) అక్కడికక్కడే మృతిచెందారు. 2019 నుంచి పనులు ప్రారంభమవ్వగా శ్రీనివాస సేతు సమీపంలో కొన్ని సెగ్మెంట్లు పక్కకు ఒరిగిపోయాయి. తర్వాత జరిగిన ప్రమాదాల్లో ఇదే పెద్దది.

మూడు సెగ్మెంట్లతో పనులు పూర్తి

టీటీడీ ప్రధాన భాగస్వామ్యంతో శ్రీనివాస సేతు ఫ్లైఓవర్‌ను నిర్మిస్తున్నారు. మొత్తం రూ.650.50 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. తిరుచానూరు మార్కెట్ యార్డు నుంచి కపిలతీర్థం నంది కూడలి వరకు 6.4 కిలో మీటర్ల పొడవుతో శ్రీనివాస సేతును నిర్మిస్తున్నారు. మొత్తం 171 పిల్లర్లు, పిల్లర్ల మధ్య ఏర్పాటు చేసే సెగ్మెంట్లు మొత్తం 2,558తో పనులు పూర్తవుతాయి. ఇప్పటి వరకు 2,555 సెగ్మెంట్లను పిల్లర్లపై ఏర్పాటు చేశారు. చివరి మరో మూడు సెగ్మెంట్లు లిఫ్ట్ చేసేక్రమంలో(2,556వ సెగ్మెంట్) ఈ ప్రమాదం చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి కల్లా సెగ్మెంట్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తి కానున్న నేపథ్యంలో చోటు చేసుకున్న ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది.

7న ఫిట్‌నెస్ సర్టిఫికెట్

500 టన్నుల సామర్థ్యాన్ని అవలీలగా ఎత్తగలిగే భారీ క్రేన్ కేవలం 70 టన్నుల సిమెంట్ సెగ్మెంట్ ఎత్తే క్రమంలో ఐరన్ రోప్ తెగిపోయింది. ఈ భారీ క్రేన్ ఫిట్ నెస్ సర్టిఫికెట్‌ను ఈ నెల 7వ తేదీన పొందారు. హైదరాబాద్‌లోని తుల్జా భవాని ఇంజినీర్స్‌కు చెందిన ఈ భారీ క్రేన్ 2012 మోడల్‌కు చెందినది. ఆంధ్రప్రదేశ్ ఫ్యాక్టరీస్ రూయిస్ కాంపిటెంట్ పర్సన్ నుంచి 2024 జనవరి 6వ తేదీ వరకు ఫిట్ ఫర్ వర్కింగ్ కండీషన్ సర్టిఫికెట్‌ను పొందారు. అయితే రోప్ అరిగిపోవడం, గ్రీస్ తేమ తగ్గి జిగురు ఆరిపోవడంతోనే క్రేన్‌కు ఉపయోగించే ఐరన్ రోప్ తెగిపోవడానికి కారణంగా భావిస్తున్నారు. అది కూడా పటిష్టంగానే ఉందని, దురదృష్టమే ప్రధాన కారణమని మరికొందరూ పేర్కొంటున్నారు.

నా అనేవారు లేరు

పొట్టకూటికోసం వచ్చిన కూలీలు ఊరుకాని ఊరొచ్చి మృత్యువాత పడ్డారు. మృతుల కుటుంబ సభ్యులు దరిదాపుల్లో లేకపోవడంతో అనాథశవాలుగా మిగిలిపోయాయి. తోటి కూలీలు తీవ్ర నిరాశలో మునిగిపోయారు. మృతదేహాలను చూస్తూ చలించిపోయారు. మృత దేహాలను తిరుపతి రుయా ఆస్పత్రి మార్చురీలో ఉంచారు.


సెగ్మెంట్‌ను అమర్చే క్రమంలో తెగిపడిన క్రేన్ తీగలు


ప్రమాదంలో నేలకొరిగిన సెగ్మెంట్

ఆదుకుంటాం



తిరుపతిలో జరుగుతున్న శ్రీనివాససేతు పనుల్లో అపశ్రుతి చోటుచేసుకోవడం చాలా బాధాకరం. ఇద్దరు కాంట్రాక్టు కార్మికులు మృతి చెందడం మనసును కలచివేసింది. మృతుల కుటుంబాలకు పూర్తిసహాయ సహకారాలు అందిస్తాం. – వైవీ సుబ్బారెడ్డి, టీటీడీ చైర్మన్

ప్రమాదం.. బాధాకరం



శ్రీనివాస సేతు నిర్మాణ పనుల్లో ప్రమాదం చోటు చేసుకోవడం బాధాకరం. ఇద్దరు కార్మికులు మృతి చెందడం దిగ్భ్రాంతిని కలిగించింది. వారి కుటుంబానికి సంతాపం తెలియజేయడం తోపాటు అండగా నిలబడతాం. ప్రమాదం వెనుక మానవ తప్పిదం ఏమాత్రం లేదు. మెకానిజం లోపం వల్లే చోటు చేసుకుంది. అఫ్కాన్ సంస్థ అన్ని జాగ్రత్తలు తీసుకుంది. పనులు పూర్తవుతున్న క్రమంలో అపశ్రుతి చోటు చేసుకోవడం బాధాకరం. 500 టన్నులను ఎత్తగలిగే ఈ భారీ క్రేన్ కేవలం 70 టన్నుల సామర్థ్యం కలిగిన సెగ్మెంట్‌ను పైకి ఎత్తే క్రమంలో రోప్ తెగిపోవడం దురదృష్టకరం. – భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్యే, తిరుపతి

మృతుల కుటుంబాలకు అన్నివిధాలా న్యాయం



శ్రీనివాస సేతు నిర్మాణ పనులు చివరి అంకంలో ఉన్నాయి. ఇందులో మానవ తప్పిదం లేదు. మృతుల కుటుంబాలకు అన్ని విధాలుగా న్యాయం చేస్తాం. నిర్మాణ సంస్థ ఆఫ్కాన్స్ నుంచి, కేంద్ర ప్రభుత్వ బీమాతో పాటు పీఎఫ్, స్మార్ట్ సిటీ నుంచి కూడా ఆర్థిక సాయాన్ని అందజేస్తాం. మృతదేహాలను స్వగ్రామం పంపేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. – డీ.హరిత, మేనేజింగ్ డైరెక్టర్, తిరుపతి స్మార్ట్ సిటీ



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,600
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,532
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.77,500
రిటైల్ వెండి గ్రాము	రూ.79.50

తిరుపతి బస్ టెర్మినల్‌ను అభివృద్ధి చేయండి


కేంద్ర మంత్రితో ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం: అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో తిరుపతి బస్ టెర్మినల్, ఇంటర్-మోడల్ స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని ఎంపీ గురుమూర్తి కోరారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలోని కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వశాఖ కార్యాలయంలో ఆ శాఖ మంత్రి నితిన్ గడ్కరిని కలిసి విన్నవించారు. తిరుపతి బస్ టెర్మినల్‌లో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో ఇంటర్-మోడల్ స్టేషన్ అభివృద్ధి కోసం నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటికే ఉన్న నాలుగు లేన్ల తిరుపతి బైపాస్‌ను కి.మీ 274.800 నుంచి కిమీ 294.00 వరకు 19.2 కి.మీ అప్‌గ్రేడ్ చేయాలని సూచించారు. ఈ రహదారి విస్తరణ పనులను 'పీడీ చెన్నై ఏ హెచ్‌ఏఐ' నుంచి 'పీడీ తిరుపతి ఏ హెచ్‌ఏఐ'కి మారుస్తూ మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారన్నారు. తడ – శ్రీకాళహస్తి, ఉతుకోట – సత్యవేడు – తడ, గూడూరు – రాజంపేట ఈ మూడు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించే అంశంపైన మరో భేటీలో చర్చించనున్నట్లు ఎంపీ వెల్లడించారు. తిరుపతిలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్-ఎంఈ) స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్)ను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి భానుప్రతాప్‌సింగ్ వర్మను కోరారు.

SRI PADMAVATI MAHILA VISVAVIDYALAYAM HOSTEL
(WOMEN'S UNIVERSITY), Tirupati
e-Procurement Notice Inviting Tender
Roc.No./SPMVVCH/Supply of Iron Cots/2023 Date: 26.07.2023
Tenders are invited for Supply of Iron Cots to SPMVV Hostel

Bid document downloading start date	31.07.2023 @ 04.30 P.M
Bid document downloading end date	17.08.2023 @ 02.00 P.M
Technical Bid Opening Date & Time	17.08.2023 @ 02.30 P.M
Price bid opening Date & Time	26.08.2023 @ 04.00 P.M

Further details can be seen at e-procurement platform in www.apeprocurement.gov.in
Sd/- REGISTRAR

పేదల అభ్యున్నతికే సురక్ష


గూడూరు: లబ్ధిదారుకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, జెడ్పీటీసీ

గూడూరురూరల్ : పేద ప్రజల అభ్యున్నతికే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు అన్నారు. గూడూరు పట్టణంలోని బాలాజీనగర్‌లో 11 సచివాలయం, రెండో పట్టణ పరిధిలోని నరసింగరావుపేట 21 సచివాలయాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన పాల్గొని, సర్టిఫికెట్లు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి నాగులు, ఎం సతీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకు ప్రభుత్వాన్ని తీసుకొచ్చిన ఘనత జగన్‌దే

ప్రజల వద్దకు ప్రభుత్వాన్ని తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డిదేనని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. గూడూరు మండలం పాలిచెర్ల సచివాలయంలో గురువారం ఎంపీపీ గురవయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జగననన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ జితేంద్ర, వైఎస్సార్‌సీపీ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సునీల్‌రెడ్డి, సర్పంచ్‌లు వసంత్‌కుమార్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు బాబురెడ్డి, మహేంద్రయాదవ్, భాస్కర్‌రాజు, శ్రీనివాసురాజు పాల్గొన్నారు.

సురక్షతో పత్రాలు మంజూరు

చిల్లకూరు: పలు రకాల ధ్రువపత్రాలను జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉచితంగా అందించే ఏర్పాటు చేస్తున్నారని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని ఓడూరులో జరిగిన కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ మాణిక్య, పంచాయతీ కార్యదర్శి జమీర్, వీఆర్వో సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

పేదల కష్టాలను తీర్చేందుకు సురక్ష

ఓజిలి: పేద ప్రజల కష్టాలను తీర్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని వైఎస్సార్‌సీపీ సీనియర్‌నేత సుబ్బారావు యాదవ్ అన్నారు. ఓజిలిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ గోవిందయ్య, ఎంపీడీఓ రజనీకాంత్, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఏపీఎం నిర్మలమ్మ, ఏపీఓ ఉషారాణి, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ సిరాజ్ బాషా పాల్గొన్నారు.

ప్రజలకు లబ్ధి

సైదాపురం: జగనన్న సురక్షతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతోందని ఎంపీపీ పీ పెంచలమ్మ, జెడ్పీటీసీ సభ్యులు సీ పోలయ్య, వైస్ ఎంపీపీ టీ భాస్కర్ అన్నారు. మండలంలోని ఊటుకూరులో సర్పంచ్ పెంచలయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు , పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కే శ్రీనివాసులునాయుడు, వేములచేడు సర్పంచ్ సీ జనార్దన్‌రాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు టీ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఏడాది ముందే సంక్షేమ క్యాలండర్

దొరవారిసత్రం: జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత వివిధ పథకాల లబ్ధిదారులు ఎదురు చూసే పనిలేకుండా ఏడాది ముందే వచ్చే ఏడాది ఏ నెలలో ఏఏ పథకాలు అందజేస్తారనే విషయం సంక్షేమ క్యాలండర్ ద్వారా నిర్ణయిస్తున్నారని ఎంపీడీఓ సింగయ్య తెలిపారు. గురువారం పోలిరెడ్డిపాళెంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, కన్నెమ్మ, ఎంపీటీసీ సభ్యుడు వెంకటరత్నమ్మ, నాయకులు విజయ్‌కుమార్, హుస్సేన్, హరి, సుధాకర్, పురుషోత్తం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం

వెంకటగిరిరూరల్: ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారని మండల ప్రత్యేకాధికారి నాగార్జునసాగర్ పేర్కొన్నారు. మండలంలోని సిద్ధవరంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీదేవి, సర్పంచ్ నాగేంద్రప్రసాద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రత్యేకాధికారి నాగార్జునసాగర్

రాపూరులో..

రాపూరు: మండలంలోని ఆకలివలస సచివాలయ పరిధిలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటస్వామి, సర్పంచ్ పెంచలరెడ్డి, ఎంపీడీఓ అప్పాజీ పాల్గొన్నారు.

స్పష్టంగా ఓటర్ల సవరణ


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ

తిరుపతి అర్బన్: ఓటర్ల సవరణ తప్పుల్లేకుండా స్పష్టంగా తయారు చేయాలని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన రాజకీయ పార్టీల నేతలతోపాటు వీఆర్వోలు, బీఎల్‌వోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతి వారం రాజకీ య పార్టీల నేతలతో సమీక్షిస్తున్నట్లు చెప్పారు. తమ పరిధిలో సమస్యలుంటే తెలియజేస్తే వాటిని సవరించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మరోవైపు వీఆర్వోలు (ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి) ఓటర్ల సవరణకు సంబంధించి ఎప్పటికప్పుడు బీఎల్‌వోల పని తీరుపై నిఘా పెట్టాలన్నారు. ఈనెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలని చెప్పారు. పది మందికి పైగా ఓటర్లు ఒకే ఇంటి నంబర్‌లో ఉంటే వాటిని సరిచూడాలన్నారు. జిల్లాలో 5,82,495 కుటుంబాలు ఉన్నాయని, ఇప్పటి వరకు 40 వేల గృహాలు మాత్రమే సర్వే చేశారని పేర్కొన్నారు. ఇప్పటివరకు 8,376 క్లెయిమ్‌లు వచ్చాయని, వాటిని పరిశీలిస్తున్న వెల్లడించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోనూ రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచించిన మేరకు ప్రత్యేకంగా తిరుపతి నియోజకవర్గంలో ఓటర్ల డోర్ నంబర్లు జీరో లేకుండా మునిసిపల్ కార్పొరేషన్ టాక్స్ ఇన్వాయిస్ మేరకు సరిదిద్దాలని డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డిని ఆదేశించారు. చంద్రగిరిలో బీఎల్‌ఓల పర్యటన సరిగాలేదన్నారు. గతంలో పోలింగ్ కేంద్రాల మార్పు పరిశీలించాలని కోరగా వీఆర్‌ఓ కనక నరసారెడ్డి పరిశీలించి చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. సమీక్షలో డీఆర్‌ఓ కోదండరామిరెడ్డి, ఈఆర్‌ఓలు కిరణ్‌కుమార్, రామారావు, చంద్రముని, కనక నరసారెడ్డి, నగరపాలక డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు బీజేపీ వరప్రసాద్, టీడీపీ మనోహరాచారి, సీపీఎం నాగరాజు, ఏఈఆర్‌ఓలు, తహసీల్దార్లు వెంకటరమణ, జరీనా, ఎన్నికల తహసీల్దార్ సురేష్, డీటీలు కిరణ్మయి, విజయభాస్కర్, జీవన్ పాల్గొన్నారు.

ఫుట్ బాల్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఎస్వీజేఎస్‌ఎం పాఠశాల క్రీడా మైదానంలో గురువారం ఫుట్ బాల్ సబ్‌జూనియర్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీలకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా సుమారు 200 మందికిపైగా క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ చూపిన బాలికల విభాగం నుంచి 20 మంది, బాలుర విభాగం నుంచి మరో 20 మంది క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీ.సుధాకర్, ఏ.రెడ్డెప్ప తెలిపారు.

రుయా అత్యవసర విభాగంలో మార్పులు



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ రవి ప్రభు

తిరుపతి తుడా: రుయా అత్యవసర విభాగంలో సమూల మార్పులుకు శ్రీకారం చుట్టామని సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు తెలిపారు. అత్యవసర విభాగ ప్రక్షాళనపై గురువారం వివిధ శాఖధిపతులతో రుయా సూపరింటెండెంటు డాక్టర్ రవిప్రభు సమీక్ష నిర్వహించారు. ఆయా విభాగాల వైద్యుల నుంచి వివరాలు సేకరించారు. ఆపై ఆయన రూపొందించిన ప్రణాళికలను అమలు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర విభాగంలో జనరల్ మెడిసిన్ పీజీ వైద్యులను షిఫ్ట్ వారీగా నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. రోగి తీవ్రతను బట్టి వైద్య సేవలను విభజించి ఆ దిశగా అవసరం మేరకు మెరుగైన చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. సీఎంఓలను ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగానికి అటాచ్‌మెంట్ చేసి అత్యవసర వైద్యంలో భాగస్వాములు చేయనున్నట్లు చెప్పారు. ఎఫ్‌ఎన్‌ఓ, ఎంఎన్‌ఓలతోపాటు ఎమర్జెన్సీ విభాగ టెక్నీషియన్ల కొరతను అధిగమించేందుకు ప్రభుత్వానికి లేఖ రాయాలని నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారావు, ఆర్‌ఎంఓలు డాక్టర్ లక్ష్మానాయక్, డాక్టర్ ఈబీ దేవి పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా క్రీడలకు పటిష్ట ఏర్పాట్లు


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: ఆడుదాం ఆంధ్రా క్రీడలకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. క్రీడల నిర్వాహణకు సంబంధించి గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2 నుంచి 46 రోజుల పాటు కార్యక్రమం ఉంటుందన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మేరా మట్టి- మేరా దేశ్ కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టాలన్నారు. ప్రతి గ్రామంలో కనీసం 75 మొక్కలు నాటడం, విద్యార్థులకు వివిధ రంగాల్లో పోటీలు నిర్వహణ, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను గౌరవించడం, రక్తదానం, యోగా తదితర కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. జగనన్న సురక్ష క్యాంపులు శుక్రవారంతో పూర్తికానున్నాయని, జిల్లాలో 691 సచివాలయాల పరిధిలో 670లో క్యాంపులు నిర్వహించి 4 లక్షల 54 వేలకు పైగా కుటుంబాలకు అవసరమైన ధ్రువపత్రాలు అందించామని వివరించారు. సమీక్షలో జిల్లా పంచాయతీ ఇంజినీర్ శంకర నారాయణ, డీపీఈఓ విశ్వనాథ్, డీఈఓ శేఖర్, జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారి సుధాకర్‌రెడ్డి, సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ, డీఎల్‌డీవో సుశీలాదేవి, ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి, డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ శివకుమార్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కో-ఆర్డినేటర్ హనుమంతరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయాభివృద్ధికి సహకరించండి



టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆనంద్

చిల్లకూరు: లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం డార్మెంటరీ నిర్మాణానికి టీటీడీ ద్వారా నిధులు అందజేసి సహకరించాలని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కే ఆనంద్ టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని కోరారు. టీటీడీ చైర్మన్ నెల్లూరుకు విచ్చేసిన సందర్భంగా గురువారం గూడూరు ఏఎంసీ మాజీ చైర్మన్ జానకిరామ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డితో కలసి వినతిపత్రం అందజేశారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న వెంకటగిరి బార్ అసోసియేషన్ సభ్యులు

వెంకటగిరి: మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై అకృత్యాలు, అత్యాచారాలకు పాల్పడడం, వారి ఆస్తులను తగలబెట్టడం వంటి హేయమైన చర్యలకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని వెంకటగిరి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎ గాంధీ, ప్రధాన కార్యదర్శి పి రామ్‌ప్రసాద్, సీనియర్ న్యాయవాది సాయివరప్రసాద్ డిమాండ్ చేశారు. ఆ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కోర్టు ప్రాంగణంలో మణిపూర్ ఘటనలపై నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వాసుదేవరెడ్డి, డి సుజాత, కె అజిత, జి కృష్ణప్రియ, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం



చెల్లాతమ్మ ఊరేగింపు

తడ: మండలంలోని కారూరులో జరుగుతున్న చెల్లాతమ్మ అమ్మవారి తిరునాళ్లలో భాగంగా అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

దుకాణాల్లో తనిఖీలు



ఎరువుల బస్తా తూకాన్ని పరిశీలిస్తున్న భరత్‌కుమార్

గూడూరురూరల్: స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తూనికలు, కొలతలు శాఖ అధికారులు గూడూరు పట్టణ, రూరల్ ప్రాంతాల్లోని పలు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గురువారం గూడూరు పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు, నారాయణమ్మవీధి, రూరల్ ప్రాంతంలోని చెన్నూరులో పలు దుకాణాలపై తూనికలు, కొలతలు శాఖ ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్ దాడులు చేసి ఎరువులు, బియ్యం, కందిపప్పు, వంటనూనె ప్యాకెట్ల తూకాల్లో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు ఆయా దుకాణాలపై కేసులు నమోదు చేయడంతోపాటు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు.

నిబంధనలు పాటించాలి

నాయుడుపేటటౌన్: తూనికలు కొలతల్లో నిబంధనలు తప్పక పాటించాలని ఆ శాఖ గూడూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ టీ భరత్‌కుమార్ పేర్కొన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పట్టణంలో పలు దుకాణాలను తనిఖీ చేశారు. నాయుడుపేటలో రెండు దుకాణాలపై కేసు నమోదు చేసి అపరాధ రుసుములను విధించారు.

డీవీ సత్రం చేరిన ఐక్యతా విజయపథం

దొరవారిసత్రం: మాజీ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ చేపట్టిన ఐక్యతా విజయపథం పాదయాత్ర గురువారం దొరవారిసత్రం మండలానికి చేరింది. సూళ్లూరుపేట మండలం కోట పోలూరు మీదుగా శ్రీధనమల్లి, కల్లూరు, ఆనేపూడి, నేలపట్టు, మైలాంగం, ముచ్చలగుంట, నెల్లూరుపల్లి, కలగుంట, నెలబల్లి గ్రామాల మీదుగా రాత్రి నాయుడుపేటకు చేరింది.

బొగ్గు లారీ బోల్తా ఇద్దరికి గాయాలు

దొరవారిసత్రం: ఎన్ఎం అగ్రహారం సమీపంలో జాతీయ రహదారిపై గురువారం బొగ్గు లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు నుంచి చెన్నైకు బొగ్గులోడ్‌తో వెళ్లే లారీ ఎన్ఎం అగ్రహారం వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొని, బోల్తా పడింది. ఈప్రమాదంలో చెన్నైకు చెందిన లారీ డ్రైవర్ ముత్తు, క్లీనర్ అరుల్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుమలరావు తెలిపారు.



చీరల దుకాణంలో తాతా గౌరి

■ అన్వేషిత గ్రూపు సభ్యురాలైన తాతా గౌరిది సైదాపురం మండలం ఊటుకూరు గ్రామం. ఈమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెద్ద కుమార్తె పెళ్లీడుకొచ్చింది. ఆమెకు వివాహం ఎలా చేయాలోనని మథనపడుతున్న సమయంలో ఈమెకు వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాల ద్వారా రూ.36,250 నగదు ఆమె బ్యాంకు ఖాతాలో జమ అయ్యింది. ఆ డబ్బుతో ఇంట్లోనే చీరల వ్యాపారం ప్రారంభించింది. మంచి లాభాలు రావడంతో ఆర్థికాభివృద్ధి సాధించి, కుమార్తెకు వివాహం చేసింది. ఈమెకు ఇప్పటి వరకు మూడు విడతల్లో వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.52, 500, వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.55,500 వచ్చాయి. దీంతో ఆమె ఆర్థికాభివృద్ధి సాధించి, ఆనందంగా జీవనం సాగిస్తోంది.



కూరగాయల వ్యాపారం చేస్తున్న భవానీ

■ సైదాపురం మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన అంగడి భవానీ శ్రీసాయి పొదుపు గ్రూపు సభ్యురాలు. ఈమె చాలీచాలని జీవనం సాగించేది. ఈమె తన ఇద్దరు బిడ్డల భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నా.. వారిని చదివించడానికి, వారికి కావాల్సినవి కొని పెట్టడానికి కష్టంగా ఉండేది. రోజు వారీ భర్త సంపాదన చాలేది కాదు. దీంతో ఆమె కుటుంబం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. చిరు వ్యాపారం పెట్టుకునేందుకు కూడా చేతిలో చిల్లిగవ్వ లేక కుటుంబ పోషణ భారంగా మారింది. ఆ క్షణంలో.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన జగనన్న తోడు దబ్బులు ఆదుకుంది. నాలుగు చక్రాల బండిపై కూరగాయల వ్యాపారం ప్రారంభించిం సంతోషంగా ఉంది.

పథకాల అండ.. ప్రగతి నిండా..

ఉపాధి లేక..ఆర్థికంగా నిలదొక్కుకునే దారి లేక ఇబ్బందులు పడిన వారి జీవితాలు నేడు కొత్తకాంతులీనుతున్నాయి.. నాడు ప్రభుత్వ పథకాలు అందని వారు నేడు ఊరట పొందుతున్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తుండడంతో చిరు వ్యాపారాలు చేసుకుని జీవితంలో స్థిరపడగాలిగామని వారు ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

- మహిళల ఖాతాలకే నగదు జమ
- చిన్న చిన్న వ్యాపారాలతో ఆర్థికాభివృద్ధి
- ఆనందం వ్యక్తం చేస్తున్న మహిళలు



పొదుపు మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి(ఫైల్)

సైదాపురం: మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది.గతంలో ఎన్నడూ లేని విధంగా పేద, మధ్య తరగతి వర్గాల మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారు. ఏటా క్రమం తప్పకుండా వైఎస్సార్ చేయూత, ఈబీసీ, కాపునేస్తం, ఆసరా పథకాల నగదును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఆ నగదుతో చిన్న వ్యాపారాలను చేసుకుంటున్నారు.

పథకాల లబ్ధి ఇలా..

సైదాపురం మండలంలోని 31 పంచాయతీల్లో 19 సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 45 నుంచి 60 ఏళ్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు 2020–2023 సంబంధించి వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 2,626 మందికి రూ.14,77,12,500 మేరకు చెల్లించారు.

- ఈబీసీ నేస్తం ద్వారా 701 మందికి రూ.3.10 కోట్లు చెల్లించారు.లబ్ధిదారులు ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున అందజేశారు.
- కాపునేస్తం పథకం ద్వారా 163 మందికి రూ.73 లక్షలు జమ చేశారు. ఈ పథకంలోనూ ఒక్కొక్క మహిళకు రూ.15 వేలు లబ్ధి చేకూరింది.
- జగనన్న తోడు పథకం ద్వారా 720 మందికి రూ.2.16 కోట్లు జమ చేశారు.ఒక్కో మహిళకు రూ.10 వేలు చొప్పున లబ్ధి చేకూరింది.
- ఆసరా పథకం ద్వారా ఇప్పటివరకు ప్రతి పొదుపు మహిళ గ్రూపునకు రూ.కోట్లు నేరుగా వారి పొదుపు ఖాతాల్లో జమ చేసింది.

సీఎంకు ధన్యవాదాలు



గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా మమ్మల్ని ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్సార్ ప్రభుత్వం వచ్చిన తరువాత వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ సున్నా వడ్డీ, జగనన్న తోడు ద్వారా రూ.60 వేలు అందజేశారు. కష్టకాలంలో నా ఒక్క కుటుంబానికికే ఏడాదికి రూ.60 చొప్పున లబ్ధి చేకూరుతోంది. కరోనా కష్టకాలంలో ఆదుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు. ఎప్పటికీ ఆయనకు రుణపడి ఉంటాం

-నారాయణమ్మ,ఊటుకూరు, సైదాపురం మండలం .

మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు



మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వైఎస్సార్ చేయూత, ఈబీసీ, కాపు నేస్తం ద్వారా 45 ఏళ్ల నిండిన మహిళలకు ప్రభుత్వం లబ్ధి చేకూర్చుతోంది. బ్యాంకు ఖాతాల్లోనే నేరు నగదు జమ చేస్తోంది. ఆ నగదుతో చిరు వ్యాపారాలు సాగించి, వారు తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఆర్థికంగా వెనుకబడిన అగ్రకులాల మహిళలకు సైతం పథకాల లబ్ధి చేకూర్చడం ఎంతో బాగుంది.

- మీసాల వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ,సైదాపురం

ప్రజల అండదండలే సీఎంకు శ్రీరామరక్ష



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేటటౌన్: ప్రజల అండదండలే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మండలంలోని మర్లపల్లి, అన్నమేడు గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. రెండు గ్రామాల సర్పంచ్‌లు డీ మంజుల, కే జ్యోతి, కే రాజారెడ్డి, డీ రవీంద్ర తదితరుల సారథ్యంలో నాయకులు, అధికారులతో ఎమ్మెల్యే ఇంటిటా వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాలను వివరించి, బుక్‌లెట్లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. తమకు ప్రతి గడపలో అపూర్వ ఆదరణ లభిస్తుందన్నారు. పలు కూడళ్లలో స్థానికులు ఎమ్మెల్యేతో పాటు నాయకులకు గజ పూలమాలలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ టీ జనార్దన్ రెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ టీ సుబ్రహ్మణ్యం రెడ్డి, రూరల్ జేసీఎస్ కన్వీనర్ ఓ కిషోర్‌యాదవ్, ఎంపీటీసీ సభ్యురాలు బీ అదెమ్మ, నాయకులు కలికి మాధవరెడ్డి, కే జయ రామయ్య పాల్గొన్నారు.

చెరువుకు హద్దులు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



చెరువులో ఆక్రమణలు తొలగించి హద్దులు ఏర్పాటు చేస్తున్న అధికారులు

చిల్లకూరు: తీర ప్రాంతంలోని బల్లవోలు పంచాయతీలో బాపన చెరువుకు గురువారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి, హద్దులు ఏర్పాటు చేసి, జెండాలు పాతారు. బాపనచెరువు ఆక్రమణలపై సాక్షి దినపత్రికలో ఈనెల 25వ తేదీన ఆక్రమణల అచ్చెరువు శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. అలాగే గ్రామానికి చెందిన రవి తన తోటి రైతులతో కలసి చెరువు ఆక్రమణల విషయమై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు గ్రామంలోని రైతులతో మాట్లాడి చెరువు ఎంత మేర ఉందనే విషయంపై సర్వే చేసి, ఆక్రమణలను తొలగించి, హద్దులు ఏర్పాటు చేశారు. త్వరలో ట్రెంచ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శ్యామ్, ఇరిగేషన్ ఏఈ కృష్ణయ్య, సచివాలయ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి అబ్దుల్ కలాం



విజేతకు బహుమతి అందజేస్తున్న ఎస్ఈబీ సీఐ విజయ్‌కుమార్

గూడూరురూరల్: దేశసేవకే తన జీవితాన్ని అర్పించిన మహోన్నత వ్యక్తి ఏపీజే అబ్దుల్ కలాం అని గూడూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ విజయ్‌కుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో గురువారం అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కలాం 8వ వర్ధంతి నిర్వహించారు. ఎస్ఈబీ సీఐ విజయ్‌కుమార్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చదరంగం పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ శివప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మీడియా అధికార ప్రతినిధి కే రవిచంద్రారెడ్డి, సురేంద్రరెడ్డి, రవీంద్రరెడ్డి, ఏ పార్వతయ్య, ట్రస్ట్ వ్యవస్థాపకులు తాజుద్దీన్, హనుమంతరావు, పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి



కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు

నాయుడుపేటటౌన్: మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండను పూర్తిస్థాయిలో అణచివేసి, శాంతిని నెలకొల్పాలని నాయుడుపేటలోని క్రైస్తవ సంఘాలు సంఘటితంగా గురువారం సాయంత్రం భారీ నిరసన ర్యాలీ చేపట్టాయి. మండలంలోని అన్ని చర్చిల పాస్టర్లు, బిషప్‌లతోపాటు క్రైస్తవులు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీకి ముస్లింలు, ముస్లిం మత పెద్దలు సంఘీభావం తెలిపారు.

వల్లిపేడు హెచ్‌ఎంకు అభినందన

చిల్లకూరు: మండలంలోని వల్లిపేడు గ్రామంలో ఉన్న జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎంగా పని చేస్తున్న బీ మధుకర్‌ను గురువారం పాఠశాలలోని ఉపాధ్యాయులు అభినందించారు. తిరుపతిలో గురువారం జరిగిన తిరుపతి జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం కార్యవర్గ ఎన్నికల్లో వల్లిపేడు హెచ్‌ఎం రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన్ని ఉపాధ్యాయులు అభినందించారు.

11,752 మందికి పీఎం కిసాన్ జమ

సూళ్లూరుపేట రూరల్: అర్హులైన రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధులు విడుదల చేశారని ఏడీఏ జి.అనిత తెలిపారు. తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లోని 11,752 మంది రైతులు పీఎం కిసాన్ నిధులు జమ చేశారని పేర్కొన్నారు. లబ్ధి పొందుతున్న రైతులకు ఏవైనా సమస్యలుంటే వెంటనే వీఏఏలు, ఏడీఏ కార్యాలయంలో తెలియజేయాలన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నాయుడుపేటటౌన్: మండలంలోని విన్నమాల సమీపంలో వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడిన మహిళ తిరుపతిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. విన్నమాల సమీపంలో ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడిన అన్నమేటి రేఖ(34) తిరుపతి ప్రవేటు వైద్యశాలలో చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో ఆమె ఆరోగ్యం విషమించడంతో మృతి చెందినట్లు ఎస్ఐ వేణు తెలిపారు.

కండలేరులో 17.871టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 17.871 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ ద్వారా కండలేరు జలాశయానికి వెయ్యి క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందన్నారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,060 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 50, లోలెవల్ స్లూయిస్‌కు 60 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉప్పు ద్రావణం పిచికారి చేయండి

పెళ్లకూరు: కోత దశలో ఉన్న వరి ధాన్యం మొలకెత్తకుండా ఉప్పు ద్రావణం పిచికారి చేయాలని ఏఓ డాక్టర్ ప్రవీణ తెలిపారు. గురువారం ఆమె పెళ్లకూరు ఆర్బీకేలో మాట్లాడారు. వారం రోజులుగా కురుస్తున్న జల్లులతో కోతకు వచ్చిన వరి పైరు వాలిపోయి గింజలు మొలకెత్తుతున్నట్లు తెలుస్తుందన్నారు. కొత్తూరు, పెళ్లకూరు, నెలబల్లి తదితర గ్రామాల్లో ఈసమస్యను గుర్తించినట్లు చెప్పారు. కేఎన్ఎం–1638 రకానికి చెందిన వరి వంగడాల్లో ఈసమస్య అధికంగా ఉన్నట్లు చెప్పారు. దీని నివారణకు వరి పొలాల్లో నీరు నిల్వ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వెన్నులు బాగా తడిసేలా లీటరు నీటికి 20 గ్రాములు ఉప్పు కలిపి పిచికారి చేసుకుంటే సమస్య ఉధృతి తగ్గుతుందన్నారు.

అడవి పంది దాడిలో ఒకరికి గాయాలు

సైదాపురం: మండలంలోని చీకవోలు గ్రామంలో ఉన్న తోటలో పనిచేస్తున్న పొట్టేళ్ల కోటయ్యపై గురువారం అడవి పంది దాడి చేయడంతో తీవ్ర గాయపడ్డాడు. బాధితుడి కథనం మేరకు.. కోటయ్య రోజులాగే తన తోట పనికి వెళ్లగా అడవి పంది దాడి చేసింది. దీంతో ఆయన గాయపడ్డాడు. గుర్తించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో కోటయ్యను గూడూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆత్మీయులయ్యారు!

వలంటీర్లకు వందనం



మహిళకు ఆర్థిక సాయం అందజేస్తున్న వలంటీర్ వంశీ

వాకాడు : కరోనా సమయంలో లాక్‌డౌన్ విధించడంతో బయటకు వెళ్లడం కష్టమైంది. ఆ సమయంలో పనులు లేక ఇక్కట్లు పడుతుండగా ప్రభుత్వం నియమించిన వలంటీర్లు మాత్రం నిబంధనలు పాటిస్తూ ఆత్మీయుల్లా పేదలకు అండగా నిలిశారు. కష్టకాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికీ మంజూరు చేసిన రూ.వెయ్యి ఆర్థిక సాయాన్ని వలంటీర్లు తమ పరిధిలోని ఇళ్ల వద్దకే వెళ్లి అందజేశారు. ఆర్థిక సాయంతోపాటు పింఛన్ కూడా అందించారు. అలాగే ఆ సమయంలో ప్రజల ఆరోగ్య పరిస్థితులను గుర్తించి, సకాలంలో వైద్య పరీక్షలు చేయించిన వలంటీర్ సేవలకు ప్రజలు సలాం కొడుతున్నారు.

బంధువులా ఆదుకున్నారు



కనోనా లాక్‌డౌన్‌లో మేము అగచాట్లు పడుతున్న సమయంలో మా వలంటీర్ కావలి వంశీ ధైర్యంగా మా ఇంటికే వచ్చి మమ్మల్ని బంధువులా ఆదుకున్నాడు. బంధువుల నుంచి కూడా కనీస పిలుపునకు నోచుకోని కరోనా సమయంలో ప్రభుత్వం అందించిన రూ. వెయ్యి ఆర్థిక సాయంతోపాటు పింఛన్ సకాలంలో మాకు అందించి ఊరట కల్పించాడు. ఎప్పటికప్పుడు మా ఆరోగ్య పరిస్థితులను గుర్తించి వైద్య పరీక్షలు కూడా చేయించాడు. పలువురు దాతలు అందించిన కూరగాయలు, నిత్యావసర సరుకులను మాకు అందజేశాడు.

-చేను భానుమతమ్మ, గొల్లపాలెం

కుల,మతాలకతీతంగా అందరికీ లబ్ధి



బుక్‌లెట్ అందించి లబ్ధిదారుతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కులం, మతం, పార్టీ, వర్గం, ప్రాంతాలకతీతంగా ప్రజలందరికీ లబ్ధి చేకూరుతుందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 9వ వార్డులో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వెంకటగిరికి చెందిన తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కేవీకే ప్రసాద్‌కు సుమారు రూ.1.80 లక్షల వరకూ లబ్ధి చేకూరగా సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందించేందుకు ఆయన ఇంటికి వెళ్లగా ఇంటికి తాళం వేసి ఉందని, తర్వాత అయినా వలంటీర్ ద్వారా బుక్‌లెట్ అందిస్తామని తెలిపారు.అనంతరం నేదురుమల్లి బంగ్లాలో టీమ్ జగనన్న కార్యక్రమంలో క్రియాశీలకంగా ఉన్న నియోజకవర్గంలోని 10 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కే కళ్యాణి, ఆర్టీసీ రీజినల్ మాజీ చైర్మన్ సీ శంకరరెడ్డి, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, మున్సిపల్ విప్ పూజారి లక్ష్మి, కౌన్సిలర్లు టి సుకన్య, వహీద, పద్మశాలి కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు, నాయకులు ఆర్ చిన్నా, ఎం నరసింహులు, యస్థానీబాషా, పీఏసీఎస్ అధ్యక్షుడు పీ దశరథరామిరెడ్డి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనలు



మాట్లాడుతున్న ఎఫ్‌ఆర్‌ఓ భాస్కర్‌రెడ్డి

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల కేంద్రంలోని చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపనున్నట్లు ఇన్ చార్జ్ రేంజర్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. డీవీ సత్రంలో వన్యప్రాణి విభాగం అధికారులు కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్షుల కేంద్రంలోని చెరువు కలుజు నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు ద్వారా నిధులు మంజూరు కానున్నాయన్నారు. ఈ క్రమంలో కలుజు నిర్మాణానికి అవసరమైన రూ.24 లక్షలు మంజూరు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి, కమిటీ ద్వారా తీర్మానించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు తెలిపారు. అలాగే పక్షుల కేంద్రంలో అక్టోబరు నుంచి పక్షుల రాక మొదలవుతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని సందర్శకులకు అవసరమైన ఏర్పాట్లు కూడా ఇప్పటి నుంచే చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ డీ గోపాల్‌రెడ్డి, సర్పంచ్ రామయ్య, ఎఫ్ఎస్ఓ బాలయ్య, ఏఓ రఘురావయ్య, ఆర్ఐ ప్రవీణ్‌రాయల్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులు తగ్గించుకోండి



రైతులకు మునగ మొక్కలు పంపిణీ చేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

వెంకటగిరిరూరల్ రైతులు పంట సాగులో శాస్త్రవేత్తల సూచనలు పాటించి, పెట్టుబడులు తగ్గించుకుని, ఆదాయం పెంచుకోవాలని కృషివిజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి గోవిందరాజులు తెలిపారు. కృషివిజ్ఞాన కేంద్రంలో గురువారం పీఎం కిసాన్ సమాన్‌నిధి 14వ విడత కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా వీక్షింపజేశారు. అనంతరం రైతులకు మునగ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా గోల్డ్ (గంధపు పూత పూసిన యూరియా)ను భారత ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. దీంతో ఎరువుల వినియోగ సామర్థం పెరిగి నత్రజని వృథాను అరికట్టడమేకాకుండా మొక్క ఆరోగ్యంగా పెరుగుతాయన్నారు. అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తప్పకుండా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా లీగల్ అడ్వైజర్ గురుప్రసాద్, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ పి నాగార్జున రెడ్డి, తిరుపాల్, రాజీవన శ్రీనివాసన్ సేవ ట్రస్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'హర్ దిల్‌మే వైఎస్సార్ హం సబ్ జగన్ కె సాత్'కు ఏర్పాట్లు



మాట్లాడుతున్న మగ్దూమ్ మోహిద్దీన్

గూడూరురూరల్: నియోజకవర్గంలో హర్ దిల్ మే వైఎస్సార్ హం సబ్ కె సాత్ కార్యక్రమం నిర్వహణకు ఏర్పాటు చేస్తున్నట్లు పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మగ్దూమ్ మోహిద్దీన్ తెలిపారు. గూడూరులోని వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు అందించిన సంక్షేమ పథకాల గురించి, వివరించి ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయాని తెలుసుకునేందుకు వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో హర్ దిల్‌మే వైఎస్సార్ హం సబ్ జగన్ కె సాత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషాను కలసి వచ్చిన తరువాత కార్యక్రమ తేదీలను ప్రకటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో యువజన విభాగం మండల అధ్యక్షుడు బాబు, పట్టణ కార్యదర్శులు జమీర్, షాకీర్, తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్‌ను సద్వినియోగం చేసుకోవాలి



పీఎం సందేశాన్ని వింటున్న ఏఓ భవానీ, రైతులు

చిల్లకూరు: రైతు భరోసాతోపాటు రైతులకు పీఎం కిసాన్ పథకం ద్వారా వచ్చే నగదును సద్వినియోగం చేసుకోవాలని ఏఓ గూడూరు భవానీ సూచించారు. పీఎం కిసాన్ నగదు విడుదల సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ టీవీ ద్వారా రైతులతో మాట్లాడే కార్యక్రమాన్ని మండలంలోని పారిచెర్లవారిపాళెం రైతు భరోసా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలోనే నానో యూరియా, నానో డీఏపీలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఇందుకుగాను కోరమాండల్, ఇఫ్‌కో పరిశ్రమలు మండలంలోని పారిచెర్లవారిపాళెం, ఉడతావారిపాళెం గ్రామాలలో ఉన్న రైతుల డిపోలను ఎంపిక చేసుకుని, వాటి ద్వారా రైతులకు నానో డీఏపీ, యూరియాలను అందించేలా చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసా కేంద్రం తనిఖీ

సైదాపురం: మండలంలోని లింగనపాళెంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని గురువారం నెల్లూరు జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఉద్యాన శాఖ సిబ్బంది పనితీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఏఓ హైమావతి తదితరులు ఉన్నారు.